సాక్షి
చిత్తూరు

బుధవారం ၊ 12 ၊ జూన్ ၊ 2024



వాతావరణం.. అరచేతిలో..
ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం తెలుసుకునేందుకు వివిధ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. - 8లో



ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం
పెద్దపంజాణి మండలం ఆకులవారిపల్లెలో సోమవారం రాత్రి ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టించింది. - 8లో



ఫుడ్ పాయిజన్‌తో 30 మందికి..
పలమనేరు మండలం టి.వడ్డూరులో ఫుడ్ పాయిజన్ కారణంగా 30 మంది అస్వస్థతకు గురయ్యారు. - 8లో

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చిత్తూరు కలెక్టరేట్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నివారణకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం ఆయన పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను అరికట్టడంతో భాగంగా దోమల వ్యాప్తిని నివారించేందుకు మందు పిచికారీ చేయించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధం మెరుగునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఉపాధి హామీ లేబర్ టర్న్ అవుట్, సగటు వేతనం, తాగునీటి సమస్యలు, జల్‌జీవన్ మిషన్ పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. కాలువల్లో పూడికలు తొలగించాలని చెప్పారు. తుప్పల తొలగింపుతో సహా బావులు, కుళాయిలు, బోరుల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కీటకాల నాశనానికి బ్లీచింగ్ చల్లాలని చెప్పారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీఓలు, కమిషనర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ప్రత్యక్ష ప్రసారం.. సీఎం ప్రమాణస్వీకారం



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని చిత్తూరు నాగయ్యకళాక్షేత్రం నుంచి వీక్షించేలా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఏర్పాట్లపై అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 గంటలకు ప్రమాణస్వీకారం ప్రారంభమవుతుందని, నాగయ్యకళాక్షేత్రంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

ఆన్‌లైన్‌లో పాఠ్యపుస్తకాల ఇండెంట్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాల వారు పాఠ్య పుస్తకాల ఇండెంట్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఈఓ దేవరాజు ఆదేశించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా వివరాలు నమోదు చేయాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి యాజమాన్యం ఇండెంట్ వివరాలను sims పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఈ ప్రక్రియను డీవైఈఓలు, ఎంఈఓలు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

15న ఉద్యోగ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 15వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మజ తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ చిత్తూరు బ్రాంచ్‌లో ఫైనాన్స్ అడ్వైజర్ (పార్ట్‌టైం, ఫుల్‌టైం)గా పనిచేసేందుకు అర్హత ఉన్నవారు మేళాకు హాజరుకావాలన్నారు. 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపు వారు అర్హులని చెప్పారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని వెల్లడించారు. నెలకు రూ.15 వేల వేతనం ఉంటుందన్నారు. అలాగే మహిళా శక్తి పథకంలో గృహిణిలు ఇంటి నుంచే పనిచేసే పార్ట్‌టైమ్ జాబ్‌కు సైతం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న ఉద్యోగ మేళాకు హాజరుకావాలని సూచించారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రవేశానికి దరఖాస్తులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలోని వనస్థలిలో ఉన్న రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా నడుపుతున్న ఈ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్లు జరుగుతున్నట్లు వెల్లడించారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయ్యి, 18 నుంచి 22 సంవత్సరాల మధ్య యవస్సు కలిగిన యువతీ, యువకులు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 20వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు కరకంబాడి సమీపంలోని కేవీకే కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9849951874, 7095688326 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

- చిత్తూరులోని కొంగారెడ్డిపల్లెకు చెందిన సంతానం అనే వ్యక్తి తన బిడ్డకు ఒకటో తరగతిలో అడ్మిషన్ కోసం పుత్తూరు రోడ్డులోని ఎస్టేట్ వద్ద ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలకు వెళ్లాడు. ముందుగా ఫీజు ఎంత అవుతుందని ఆరా తీశాడు. ఆ పాఠశాల సిబ్బంది ఒకటో తరగతికి రూ.50 వేలు అవుతుందన్నారు. పుస్తకాలకు అదనంగా రూ.20 వేల వరకు కట్టాల్సి ఉంటుందని సమాధానమిచ్చారు. ఫీజుల వివరాలు విన్న సంతానం అవాక్కయ్యాడు.
- తిరుపతిలోని మంగళంలో నివసించే విజయరామరాజు తన కుమారుడు సందీప్‌ను ఎయిర్‌బైపాస్ రోడ్డులో ఉన్న ఓ కార్పొరేట్ పాఠశాలలో చేర్పించేందుకు వెళ్లాడు. 5వ తరగతి అడ్మిషన్‌కు ఎంతవుతుందని ఆరా తీశాడు. ఫీజు కింద రూ.80వేలు కట్టాల్సి ఉంటుందని సదరు స్కూల్ సిబ్బంది తెలిపారు. పుస్తకాలు, యూనిఫామ్ ఇతరత్రా వాటికి మరో రూ.30వేలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో విజయరామరాజు ఖంగుతిన్నాడు.



జూన్ వచ్చిందంటే తల్లిదండ్రులకు టెన్షన్ మొదలవుతోంది. ప్రైవేట్ బడుల దోపిడీకి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అక్కడ చదువు 'కొనాలంటే' వేలకు వేలు వెచ్చించాల్సిన దుస్థితి దాపురించింది. బిడ్డ భవిష్యత్ కోసం తమ జీవితాలను అప్పుల పాలు చేసుకోవాల్సి వస్తోంది. కార్పొరేట్ స్కూళ్లలో చేర్పించి ఫీజులు కట్టలేక మానసిక ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తోంది. పేరెంట్స్ బలహీనతను ఆధారంగా చేసుకుని ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచేస్తున్నాయి. పుస్తకాలు.. బ్యాగులు.. యూనిఫామ్ పేరిట అందినకాడికి యథేచ్ఛగా దోచుకుంటున్నాయి.

చదువు కొనాల్సిందే..!

- ఫీజులు పెంచేసిన కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు
- పుస్తకాల పేరిట అదనపు దోపిడీ
- తల్లిదండ్రులపై మరింత భారం
- దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్న పేరెంట్స్

ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ బడుల సమాచారం

ప్రాథమిక పాఠశాలలు	459
ప్రాథమికోన్నత పాఠశాలలు	251
ఉన్నత పాఠశాలలు	467
విద్యార్థులు	2,54,421

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే రోజులు పోయి చదువుకొనాల్సిన రోజులు వచ్చాయి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు వెళుతున్న తల్లిదండ్రులు ఫీజుల వివరాలు తెలుసుకుని బెంబేలెత్తిపోతున్నారు. నర్సరీలో చేర్పించాలంటే ఒక్కో విద్యార్థికి కనీసం రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. పాఠశాలల్లో ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫామ్ తదితర ఖర్చులకు దాదాపు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అవసరమవుతోందని వెల్లడిస్తున్నారు. ఈ సమస్య కారణంగా జూన్ వచ్చిందంటే సామాన్య...మధ్యతరగతి ప్రజలు హడలెత్తిపోతున్నారు.

రేపే బడుల పునఃప్రారంభం

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఈ నెల 13వ తేదీన బడులు పునఃప్రారంభం కానున్నాయి. ఇదే అదనుగా భావించిన ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలవారు ఫీజుల పేరుతో దోచుకునేందుకు సిద్ధమయ్యారు. డబ్బే పరమావధిగా భావించి తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలు మొదటి టర్మ్ ఫీజులు సైతం వసూలు చేసేశాయి. మరికొన్ని పాఠశాలలు టెక్నో, ఐఐటీ, ఒలింపియాడ్ అంటూ ఎక్కువ ఫీజులు వసూళ్లు చేసేందుకు రెడీ అయ్యాయి. దీంతో ఏటా విద్యా ఖర్చు తల్లిదండ్రులకు మోతెక్కిపోతోంది. ఫీజులతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, బ్యాగులు, క్యారేజీ బ్యాగులు, బూట్లు, యూనిఫామ్, బస్సు రవాణాకు చెల్లించాల్సిన డబ్బు అదనంగా ఖర్చవుతోంది. ఈ ఏడాది కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు 15 నుంచి 25 శాతం వరకు పెంచేశారు.

ప్రైవేట్ వలలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దింది. కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించింది. ఇంగ్లిష్ మీడియంలో బోధన ప్రవేశపెట్టింది. విద్యార్థులను నాణ్యమైన విద్యను అందించింది. అయినప్పటికీ చాలా మంది తల్లిదండ్రులు అనవసరంగా ప్రైవేట్ పాఠశాలల వలలో చిక్కుకుంటున్నారు. అక్కడ ఏదో చెప్పేస్తారు.. తమ పిల్లలకు ఏదో నేర్పించేస్తారనే అపోహతో అధిక ఫీజులు చెల్లించి మరీ ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. చివరకు అప్పుల పాలవుతున్నారు.

పాఠ్యపుస్తకాల ధరలు సైతం 20 నుంచి 25 శాతం పెరిగాయి. విద్యాసంస్థల బస్సుల ఫీజులు సైతం గత ఏడాది కంటే రూ.750 వరకు పెంచేశారు.

కార్పొరేట్ బాటలో..

కార్పొరేట్ సంస్థలను చూసి సెమీ కార్పొరేట్, కొన్ని ఏ గ్రేడ్ ప్రైవేట్ పాఠశాలలు సైతం ఫీజులను పెంచేశాయి. ఈ క్రమంలోనే ముందస్తుగానే ఫీజు కట్టించుకుంటున్నాయి. అడ్మిషన్‌లు రాయించుకోవాలని ఒత్తిడి చేసి పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే యాజమాన్యాలవారు తల్లిదండ్రులకు ఫోన్లు చేసి హుకుం జారీచేస్తున్నారు. లేకపోతే మీ పిల్లల టీసీలు తీసుకుపోండి అంటూ ఒత్తిడి చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు ఫీజు కట్టి అడ్మిషన్ రాయించుకుంటున్నారు. ఈ ఏడాది పెరిగిన ఫీజులతో తల్లిదండ్రులపై దాదాపు రూ.100 కోట్లకు పైగా అదనపు భారం పడుతున్నట్లు అంచనా. చాలా వరకు కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలు కాకుండా సొంత పుస్తకాలను అమ్మడం మొదలు పెట్టారు. విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

30 శాతం పెరుగుదల

గత ఏడాది రూ.60 ఉన్న నోటు పుస్తకం ధర ఈ ఏడాది రూ.90 పైమాటే. గత ఏడాది ఆరో తరగతి విద్యార్థులకు సరాసరిగా రూ.8 వేల వరకు నోటు, పాఠ్యపుస్తకాలకు ఖర్చు అయ్యేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పుడు పెరిగిన ధరతో రూ.11,500 వరకు వెచ్చించాల్సి వస్తోందని వెల్లడిస్తున్నారు. దీంతో పాటు పెన్నులు,పెన్సిళ్లు, ఇతరత్రా వస్తువులు కొనుగోలు అదనం. అలాగే స్కూలు బ్యాగ్, బూట్లు, యూనిఫామ్, టై పేరిట అదనపు భారం పడుతుంది. గత ఏడాది కంటే ఒక్కో విద్యార్థిపై సరాసరిగా రూ.3500 అదనపు ఖర్చు పెరిగి, దాదాపు రూ.46 కోట్లు భారం తల్లిదండ్రులపై పడుతోంది.

ఇష్టారాజ్యంగా ఫీజులు



విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ బడులు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కార్పొరేట్ యాజమాన్యాలవారు ఫీజులు వసూలు చేయాలన్న నిబంధన ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. గత ఏడాది కంటే అధికంగా ఫీజులు పెంచేశారు. తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తే ఆందోళనలు చేపడతాం.
– శశికుమార్, విద్యార్థి సంఘం నేత, తిరుపతి

నోటీసు బోర్డులో పెట్టాలి



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ స్కూల్ నిర్వాహకులు తప్పనిసరిగా ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. అయితే ఎక్కడా పెట్టడం లేదు. రూ.లక్షల కొద్దీ ఫీజులను తల్లిదండ్రుల ముక్కు పిండి వసూలు చేసుకుంటున్నారు. పాఠశాలల్లో నోటుపుస్తకాలు, విద్యాసామాగ్రి అమ్మడానికి వీల్లేదు. అయినప్పటికీ అన్ని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అమ్ముతున్నారు. ఇవి తెలిసినప్పటికీ విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇలాగే వ్యవహరిస్తే ఆందోళనకు దిగుతాం.
– సద్దాం, విద్యార్థి సంఘం నేత, చిత్తూరు

పలమనేరు మున్సిపాలిటీతోపాటు మండల కేంద్రాల్లో బైక్‌రైడర్ల గోల శృతిమించుతోంది. సైలెన్సర్‌లోని మఫ్లర్‌ను తొలగించి గగుర్పాటు పుట్టించే శబ్దంతో ప్రజల మీదుగా రైడర్లు దూసుకుపోతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దడ పుట్టిస్తున్న బైక్ ఫీట్లు



- సైలెన్సర్‌లో మఫ్లర్ తీసేసి రైడింగ్
- కర్ణభేరి అదిరేలా శబ్ద కాలుష్యం
- జనం రద్దీగా ఉన్నప్పుడే విన్యాసాలు



బైక్‌పై యువకుల విన్యాసం

పలమనేరు: పోలీసులు ఎన్నోసార్లు కౌన్సిలింగ్‌లు ఇస్తున్నా యువత తీరులో మార్పు రావడం లేదు. మితిమీరిన వేగంతో బైక్‌లను నడుపుతూ ప్రమాదాలను ఆహ్వానిస్తున్నారు. గత ఐదేళ్లలో పలమనేరులో ఎనిమిదిమంది వరకు విన్యాసాలు చేస్తూ మృత్యువాత పడ్డారు. పలువురుతీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి ప్రమాదాలు పట్టణంలోనే కాదు మండల కేంద్రాల్లోనూ నిత్యకృత్యంగా మారాయి. పలమనేరు పట్టణంలోని పదుల సంఖ్యలో రైడర్లు బైక్‌లను వేగంగా భారీ శబ్దాలతో నడుపుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. మహిళల మీదికే రాజుకున్నట్లు వెళ్లి పక్కకు తిప్పడం, ఆపై బిగ్గరగా కేకలు వేయడం, వెకిలిగా ప్రవర్తించడం పరిపాటిగా మారింది. రాత్రి పదిగంటలు దాటితే పట్టణంలోని మెయిన్ రోడ్డుపై ఆగడాలు అన్ని ఇన్నీకావు. రోడ్డుపై ట్రాఫిక్ పోలీసులున్నా ఏమాత్రం బెదరడం లేదు. వారి ముందే మరింత వేగంగా వెళుతున్నారు.

మండల కేంద్రాల్లో..

నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె, వీకోట మండల కేంద్రాల్లో పెద్ద శబ్దం చేసే ఖరీదైన బైక్‌లు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. పలువురు యువకులు కేవలం ప్రజల ముందు హంగామా చేసేందుకే వీటిని కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బైరెడ్డిపల్లి చెక్‌పోస్టు, పుంగనూరు రోడ్డు, వీకోట టౌన్, గంగవరం, మదర్ థెరీసా కళాశాల, పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో యువకుల బైక్ విన్యాసాలకు హద్దే లేకుండా పోతోంది.

ప్రత్యేక దృష్టి సారించాం



పలమనేరు పట్టణంలో బైక్ రైడింగ్‌లు, విన్యాసాలు, బెట్టింగులపై సమాచారం ఉంది. ఇలాంటి వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా జనావాసాల్లో హంగామా చేసే రైడర్లపై ప్రత్యేక నిఘా పెట్టాం. త్వరలోనే వీరి ఆట కట్టిస్తాం.
– చంద్రశేఖర్, అర్బన్ సీఐ, పలమనేరు

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 78,064 మంది స్వామివారిని దర్శించుకోగా 33,869 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.7 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అంతర్ జిల్లాల సీనియర్ టీ–20 విజేత కడప



కడప జట్టుతో ఏసీఏ ప్రతినిధులు

- ద్వితీయ స్థానంలో నిలిచిన అనంతపురం జట్టు
- ట్రోఫీలు అందజేసిన సౌత్ జోన్ క్రికెట్ జీఎం

తిరుపతి రూరల్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సహకారంతో చిత్తూరు జిల్లా అడహక్ కమిటీ ఆధ్వర్యంలో తుమ్మలగుంట కేవీఎస్ క్రీడా మైదానంలో జరుగుతున్న అంతర్ జిల్లాల ఏసీఏ సౌత్ జోన్ సీనియర్ మెన్ టీ 20 క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జిల్లా విజేతగా నిలిచింది. గత ఐదు రోజులుగా జరుగుతున్న ఈ టోర్నీలో కడప, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి. ఒక్కొక్క టీంకు నాలుగు మ్యాచ్‌లు జరగగా అన్ని మ్యాచ్‌ల్లో గెలిచిన కడప జట్టు ఫైనల్ విజేతగా నిలిచి కప్పు కైవశం చేసుకుంది. రన్నర్స్‌గా అనంతపురం జట్టు నిలువగా, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జట్లు వరుసగా 3, 4, 5 స్థానాలలో నిలిచాయి. మంగళవారం కేవీఎస్ క్రికెట్ క్రీడా మైదానంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో విన్నర్స్, రన్నర్స్ జట్లకు సౌత్ జోన్ క్రికెట్ జీఎం ఖాజా మొహిదీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ట్రోఫీలను అందజేశారు. చిత్తూరు జిల్లా అడక్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ శ్రీధర్, సభ్యులు ఎలియాజర్, ఐదు జిల్లాల క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పవిత్రం.. ప్రసన్నుడి నిలయం

- ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం
- 17 నుంచి 25 వరకు అప్పలాయిగుంటలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



ఆలయ ఆవరణలో రంగవల్లులు



పూజా సామగ్రి తీసుకువస్తున్న అర్చకులు



ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న అర్చకులు



ఆలయంలో సిద్ధమవుతున్న చలువ పందిళ్లు

పుత్తూరు: అప్పలాయిగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఈనెల 17 నుంచి 25 వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆనవాయితీ ప్రకారం తిరుమంజనం జరిపించారు. ఈ సందర్భంగా వేకువనే స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం చేపట్టారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలంతో ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. తదనంతరం 11 గంటలకు స్వామివారి సర్వదర్శనానికి భక్తులను అనుమతించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ప్రధాన అర్చకులు సూర్యకుమారాచ్చార్యులు, సూపరిండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివ పాల్గొన్నారు.

16న అంకురార్పణ

శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఈనెల 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ దాససాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు.

17 నుంచి వాహన సేవలు

బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు జరగనున్నాయి. 17వ తేదీ ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం పెద్దశేష వాహనం, 18న ఉదయం చిన్నశేష వాహనం, సాయంత్రం హంస వాహనం, 19 ఉదయం సింహ వాహనం, సాయంత్రం ముత్యపు పందిరి వాహనం, 20 ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, సర్వభూపాల వాహనం, 21 ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం గరుడ వాహనం, 22 ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం గజ వాహనం, 23 ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 24 ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనం, 25 ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం కానున్నాయి.

క్లుప్తంగా

ఫుడ్ పాయిజన్‌తో 30మందికి అస్వస్థత



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీఓ లక్ష్మి

పలమనేరు:మండలంలోని టి.వడ్డూరులో మంగళవారం ఫుడ్ ఫాయిజన్ కారణంగా 30 మంది అస్వస్థతకు గురయ్యారు. వివరాలు.. గ్రామానికి చెందిన వెంకటేశు అనే వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. ఆదివారం ఆయన కర్మక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో మిగిలిన మాంసాహారాన్ని ఫ్రిజ్‌లో నిల్వ చేసుకుని తిన్నారు. దీంతో వాంతులు, విరేచనాల బారిన పడ్డారు. బాధితులను పలమనేరు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి వెంటనే గ్రామానికి వెళ్లారు. బాధితులను పరామర్శించారు. వైద్యశిబిరం ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విద్యాసాగర్, ఈఓపీఆర్‌డీ గిరిధర్, పంచాయతీ సెక్రటరీ సాయిబంగారం, సర్పంచ్ మునస్వామి పాల్గొన్నారు.


ధ్వంసం.. కర్ణాటక మద్యం



మద్యం కేసులను జేసీబీతో తొక్కిస్తున్న అధికారులు

గంగవరం : రెండేళ్లుగా వివిధ ప్రాంతాల్లో సీజ్ చేసిన సుమారు రూ.25.66లక్షల విలువైన కర్ణాటక మద్యం సీసాలు, ప్యాకెట్లను మంగళవారం పోలీస్, సెబ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు. పోలీస్ స్టేషన్‌లో నిల్వ చేసిన మద్యం కేసులను ట్రాక్టర్‌లో తరలించి కూర్నిపల్లె సమీపంలోని చెక్‌డ్యామ్ వద్ద జేసీబీతో పగులగొట్టించారు. సెబ్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు మాట్లాడుతూ మొత్తం 45 కేసుల మద్యాన్ని ధ్వంసం చేయించామని వెల్లడించారు. కార్యక్రమంలో సీఐ చిన్నగోవింద్ పాల్గొన్నారు.

వాన రాకడ.. ప్రాణం పోకడ కనిపెట్టలేమని గతంలో పెద్దలు చెప్పేవారు. అయితే ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో వర్షం ఎప్పుడు వస్తుందో సులువగా కనిపెట్టేస్తున్నారు. కొన్ని యాప్స్‌ను ఉపయోగించి వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. మెసేజ్‌ల రూపంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అరచేతిలో సెల్ ఫోన్ ఉంటే చాలు.. ప్రకృతి విపత్తుల గురించి ముందస్తుగానే హెచ్చరికలు అందుకుని జాగ్రత్త పడుతున్నారు.





వాతావరణం.. అరచేతిలో సమాచారం!

- వాన రాకడ కనిపెట్టేందుకు ప్రత్యేకంగా యాప్స్
- పంచాయతీ స్థాయిలో అంచనాకు అవకాశం
- వ్యవసాయ రంగానికి ప్రయోజనం
- విపత్తు సమయంలో మరింత ఉపయోగకరం


చిత్తూరు కార్పొరేషన్ : వర్షం రాకను టెక్నాలజీ సాయంతో అంచనా వేయవచ్చు. యాప్స్ ద్వారా తెలుసుకున్న సమాచారాన్ని మెసేజ్‌ల రూపంలో సెల్‌ఫోన్లకు పంపి ప్రజలను అప్రమత్తం చేయవచ్చు. ఫలితంగా భారీ వర్షాలు, ఈదురు గాలులు, పిడుగుపాటు తదితర విపత్తుల నుంచి పూర్తిగా బయటపడలేకపోయినా నష్టం శాతాన్ని తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా వ్యవసాయ, అనుబంధరంగాల వారికి వాతావరణ పరిస్థితులను కనిపెట్టే యాప్స్ ఎంతో ఉపయోగకరమని నిపుణులు సూచిస్తున్నారు. భారీ వర్షాలు, ఈదురుగాలులతో పంట నష్టం వాటిల్లుతుంది. ఈ యాప్‌ల ద్వారా రాబోయే ప్రమాదాన్ని ముందుగానే తెలుసుకుంటే కొంతో కొంత జాగ్రత్త పడే అవకాశముంటుంది. ఈ క్రమంలోనే పిడుగుపాటు కారణంగా రైతులు, పశువులు, గొర్రెలు ఇతర జంతువుల ప్రాణాలు పోతుంటాయి. పిడుగుపడే విషయాన్ని ముందుస్తుగా తెలుసుకునే వీలు లేక ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవిస్తున్నాయి. ఈ కష్టాలకు భారత వాతావారణ విభాగం (ఐఎండీ) తెరదించింది. గ్రామ పంచాయతీ స్థాయిలోనే వాతావారణం అంచనాలు విడుదల చేస్తోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్, ఇంటర్‌నెట్ సౌకర్యం ఉంటే వాతావారణం వివరాలు తెలుసుకుని అప్రమత్తమయ్యే వెసులుబాటు కల్పిస్తోంది.

'మేఘదూత్'తో ముందస్తుగా..

పంట సాగులో విత్తనం నుంచి ఎరువులు వేసే సమయంలో రైతులను నష్టపరిచేది వర్షమే. ఇలాంటి కష్టాల నుంచి బయపడేందుకు మేఘదూత్ యాప్‌ను రూపొందించారు. దీని సాయంతో వారం ముందుగానే వాతావారణ మార్పులు, వర్షసూచన సహా ఆకాశం మేఘావృతం అవుతుందా?..లేదా?.. గాలులు ఏదిశ నుంచి ఏదిశకు వీస్తాయి?తేమ శాతం, ఉష్ణోగ్రత వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. ఈ యాప్ ద్వారా మంగళ, శుక్రవారాల్లో వాతావరణ సమాచారంతో రైతులకు మేసేజ్‌లు పంపుతున్నారు.

రెయిన్ అలారమ్ : గూగుల్ ప్లేస్టోర్ నుంచి రెయిన్ అలారమ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వినియోగదారుడు అందించిన సమాచారం మేరకు అతడికి సమీపంలోని 20 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ వర్ష సూచనలున్నాయో క్షణాల్లో ముందే తెలుసుకుని జాగ్రత్త పడే అవకాశం ఉండటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.





వజ్రపాత్ యాప్ : గూగుల్ ప్లేస్టోర్ నుంచి వజ్రపాత్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ గుర్తుపై నొక్కితే రెండు రకాల సమాచారం వస్తుంది. ఎడమవైపు పిడుగు గుర్తు, పిడుగు సమాచారం కనిపిస్తుంది. అక్కడ నొక్కితే మనం ఉన్న ప్రాంతం సహా మ్యాప్ కనిపిస్తుంది. రెడ్, ఆరెంజ్, ఎల్లో కలర్ వలయాలు కనిపిస్తాయి. వీటి పక్కనే 8,15,30 అంకెలుంటాయి. ఈ అంకెల ప్రకారం అంటే కొద్ది సేపట్లో ఎంత దూరంలో పిడుగు పడే అవకాశం ఉందని చూపిస్తుంది. అలాంటిదేమీ లేకపోతే మీ సమీపంలో పిడుగుపడే అవకాశం లేదని చూపిస్తుంది. యాప్ కుడి భాగంలో పిడుగుపాటు హెచ్చరికలు తెలిపే బటన్ ఉంటుంది. యాప్ ఆన్ చేసి ఎప్పటికప్పుడు అప్రమత్తం కావొచ్చు.

దామిని యాప్

ఎప్పటికప్పుడు మెరుపు హెచ్చరికలను తెలియజేసేందుకు దామిని యాప్ ఉపయోగపడుతుంది. దీని సాయంతో సమీపంలోని 20 కిలోమీటర్ల పరిధిలో 5 నుంచి 20 నిమిషాల వ్యవధిలో పిడుగు ఎక్కడ పడే అవకాశం ఉందో తెలుసుకోవచ్చు. లోకేషన్ ఆధారంగా ఎక్కడెక్కడ మెరుపులు వచ్చే అవకాశముందో సూచిస్తుంది. పిడుగు పడినప్పుడు తోటివారికి అందించాల్సిన వైద్యసాయం, శ్వాస ఆగిపోతే తీసుకోవాల్సిన చర్యలు, గుండె చప్పుడు ఆగిపోతే సీపీఆర్ చేయడం తదితర వివరాలను తెలియజేస్తుంది.



ఆన్‌లైన్‌లో అందుబాటు

"ఎప్పటికప్పుడు వాతావారణ పరిస్థితులను తెలుసుకునేందుకు కొన్ని యాప్‌లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. వర్ష సూచన తెలియక విత్తనాలు వేసుకోవడం, పురుగు ముందులు పిచికారీ, ఎరువులు వేసుకోవడం చేస్తుంటారు. అప్పుడు వర్షం వస్తే నష్టాలు తప్పవు. వాతావరణ యాప్‌ల ద్వారా ముందస్తుగా అప్రమత్తం కావచ్చు. నష్ట నివారణ చేసుకోవచ్చు.

– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖాధికారి



ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



విరిగిన కొమ్మలు చూపుతున్న రైతు

పెద్దపంజాణి: మండలంలోని ఆకుల వారిపల్లెలో పంటలపై సోమవారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేసింది. సుభాషణరెడ్డి అనే రైతుకు చెందిన టమాట తోటను నాశనం చేసింది. నాటేందుకు సిద్ధం చేసుకున్న 70 మామిడి మొక్కలను తొక్కేసింది. అలాగే బయ్యారెడ్డి అనే రైతుకు చెందిన మామిడి చెట్లను విరిచేసింది. దీనిపై సమాచారం అందుకున్న రాయలపేట ఫారెస్ట్ బీట్ అధికారి రవికుమార్ మంగళవారం గ్రామానికి చేరుకున్నారు. ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పరిహారం కోసం వివరాలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వెల్లడించారు. ట్రాకర్ల సాయంతో ఏనుగుల గుంపును అడవిలోకి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక్కో వ్యక్తికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ చిత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 11 మందిపై కేసు నమోదుచేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.10 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. సీఐ నిత్యబాబు మాట్లాడుతూ గత ఆరు నెలల్లో మొత్తం 205 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెట్టామని, కోర్టు రూ.14లక్షల వరకు జరిమానా విధించిందని వెల్లడించారు. ఒక్కసారి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారు రెండో సారి ఇదే తప్పు చేస్తే రూ.15వేల జరిమానా, మూడేళ్ల వరకు జైలుశిక్ష విధించే అవకాశముందని తెలిపారు.

ఇంట్లో చోరీ

చిత్తూరు అర్బన్: నగరంలోని దొడ్డిపల్లెలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. సంజన్‌కుమార్ అనే వ్యక్తి ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలిసి బెంగళూరు వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో ఉంచిన 60 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిసింది. దీంతో వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.2.50లక్షల నగలు అపహరణకు గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక బలం మనదే.. ఎవరికీ భయపడొద్దు

- ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఎవ్వరూ వదులుకోవద్దు
- ప్రతి పక్షంలోనూ ప్రజల మంచి కోసమే పనిచేద్దాం
- ఐక్యమత్యంతో దాడులను ఎదురిద్దాం
- సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి



సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: 'జగనన్న పరిపాలనలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే.. ప్రజలు మీ అందరినీ ఆశీర్వదించి గెలిపించారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది.. అయినా స్థానిక సంస్థల్లో మన బలం అలాగే ఉంది.. ఎవ్వరు ఎన్ని చేసినా, భయపెట్టినా, ప్రలోభ పెట్టినా ప్రజలు మనకు ఇచ్చిన అధికారాన్ని నిజాయితీగా, నిశ్వార్థంగా కొనసాగించాలి.. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఎవరి కోసమో వదులుకోవద్దు.. మీకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నేను మీతోనే ఉంటా.. ప్రతి పక్షంలో కూడా ప్రజలకు సేవ చేయడానికి స్థానిక సంస్థల అండతో మనం దరం సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచించారు. తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట గ్రామంలోని ఆయన నివాసం వద్ద మంగళవారం చంద్రగిరి, రామచంద్రాపురం, పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటలు కూడా గడవకుండానే చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యర్థి పార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేయడం అమానుషమన్నారు. అంతేకాకుండా ఇళ్లపై దాడులు చేయడం, ఆస్తులు ధ్వంసం చేయడం వంటి దుర్మార్గమైన పనులు చేస్తున్నారన్నారని మండిపడ్డారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఎవ్వరూ ఇలా చేయలేదని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులపై జరిగే దాడులను ఐక్యతతో ఎదుర్కోవడానికి అందరూ సిద్ధ పడాలన్నారు. ప్రతిపక్షంలో ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయడానికి సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులుగా పదవి పూర్తయ్యే వరకు ప్రజలకు మంచి చేయడానికి తప్ప ఎవ్వరికీ భయపడాల్సిన పని లేదన్నారు. ప్రజా ప్రతినిదులపై అధికార పార్టీ నేతలు ఎవ్వరైనా దాడులు చేసినా, ఇబ్బంది పెట్టినా కేంద్ర మానవ హక్కుల సంఘం, రాష్ట్ర మానవ హక్కుల సంఘం, సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అధికారం చేతిలో ఉంది కదా అని ఏమైనా చేస్తారన్న ఆలోచన నుంచి స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు బయటకు రావాలన్నారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్, ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీలదే రాజ్యాధికారం అన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. అనంతరం అన్ని మండలాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలతో ఆత్మీయ విందు భోజనం చేశారు.



చిన్నగొట్టిగల్లు మండల నేతల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

వేద విజ్ఞానానికి నిలయం వేదిక్ వర్సిటీ

- యూజీ, పీజీ అడ్మిషన్లకు 15 వరకు దరఖాస్తుల ఆహ్వానం
- తాళపత్ర గ్రంథాల సంరక్షణ, పరిశోధనే ధ్యేయం
- భావితరాలకు వేద విజ్ఞానం అందించే ప్రయత్నం
- పరిశోధనలకు పెద్దపీట
- ఎస్వీ వేదిక్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ పరిపూర్ణ వేద విజ్ఞానానికి నిలయమని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి తెలిపారు. వేదాల్లోని సారాంశాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు వర్సిటీ పనిచేస్తుందన్నారు. వేదిక్ వర్సిటీలో ఏడు వేదాల్లోని పరిజ్ఞానాన్ని నిష్ణాతులైన అధ్యాపకులచేత విద్యార్థులకు బోధిస్తున్నామని చెప్పారు. భావిభారతావనికి వేద విజ్ఞానాన్ని అందించేందుకు వర్సిటీ అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటుందన్నారు. యావత్ భారత దేశంలో వేద విద్యను సంపూర్ణంగా అందిస్తున్న ఏకైక విశ్వవిద్యాలయం ఎస్వీ వేదిక్ వర్సిటీనే అని పేర్కొన్నారు. 2024–25 అకడమిక్ అడ్మిషన్ల ప్రక్రియ నేపథ్యంలో వర్సిటీలోని కోర్సుల వివరాలు, అర్హతలు, ఉపాధి అవకాశాలపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..



వేదిక్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి

యూజీ, పీజీ అడ్మిషన్లకు 15న చివరి గడువు

వర్సిటీలో ప్రధానంగా 21 విభాగాల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇందులో యూజీ (శాస్త్ర) కోర్సులకు సంబంధించి వేద విభాగంలో రుగ్వేద, క్రిష్ణ యజుర్వేద, శుక్ల యజుర్వేద, సామవేద, అధర్వణ వేదం లోనూ, ఆగమశాస్త్రం విభాగంలో వైఖానస ఆగమం, పంచరత్రగామం, శైవాగమం లోనూ, పౌరోహిత్యం విభాగంలో అశ్వాలయన, అపస్తంభ, పరస్కర, వైఖానస పౌరోత్యంలోనూ, వేదభాష్యంలోని 5 విభాగాలలో, కల్ప, మీమాంస విభాగాల్లో అడ్మిషన్లు చేపడుతున్నాం. ఇందులో ఒక్కో విభాగంలో 15 సీట్లు భర్తీ చేస్తున్నాం. అదే విధంగా పీజీ(ఆచార్య) కోర్సులకు సంబంధించి వేదాల్లో ఐదు విభాగాల్లోనూ, ఆగమ శాస్త్రంలో మూడు విభాగాల్లోనూ, పౌరోహిత్యంలో నాలుగు విభాగాల్లో, వేదభాష్యంలో ఐదు విభాగాల్లో, మీమాంస, కల్పన వంటి పీజీ కోర్సులలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానించాం. పీజీ కోర్సులలో ఒక్కో విభాగానికి 10 సీట్లు భర్తీ చేయనున్నాం. దీంతో పాటు ఏదేని డిగ్రీ కలిగి సంస్కృతంపై పట్టు ఉన్నవారి కోసం డిప్లొమో కోర్సులను ప్రవేశపెట్టాం. ఇందులో టెంపుల్ మేనేజ్‌మెంట్, జోతిష్యం, వాస్తు, మ్యాన్‌స్క్రిప్ట్‌కోర్సులను అందిస్తున్నాం. వీటితో పాటుగా ఇంటర్ విద్య పూర్తి చేసి సంస్కృతం పరిజ్ఞానం ఉన్న వారి కోసం ఏడు విభాగాలలో సర్టిఫికెట్ కోర్సును అందిస్తున్నాం.

ఉపాధి కల్పనే లక్ష్యంగా అడుగులు

దేశంలోనే ఏకైక వేదిక్ వర్సిటీగా పిలవబడే టీటీడీ సంస్థ వేదిక్ వర్సిటీలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు వంద శాతం ఉపాధి, ఉద్యోగాలు పొందుతున్నారు. ప్రధానంగా వర్సిటీలో వేద, ఆగమ, పౌరోహిత్యంలో పలు కోర్సులను అందిస్తున్నాం. విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న విభాగంలో మరింత పట్టు సాధించేందుకు నిపుణులైన అధ్యాపకులచే బోధన అందిస్తున్నాం. వర్సిటీలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. దేశానికే తలమానికమైన అయోధ్యలో నిర్మించిన రామమందిర్‌లో వర్సిటీ నుంచి ఇద్దరు విద్యార్థులు పనిచేస్తుండడం గర్వంగా ఉంది. అదేవిధంగా దేశ, విదేశాల్లోని పలు ఆలయాల్లో పండితులుగాను, వేద అధ్యాపకులుగాను, ఆగమశాస్త్ర నిపుణులుగా రాణిస్తున్నారు. వర్సిటీలో కోర్సు పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి స్థిరపడ్డారు. ఇది జీవితంలో సంతోషించదగ్గ విషయం.

ఏపీ ఈఏపీ సెట్‌లో జిల్లాకు ర్యాంకులు



బద్రి (454)



కామేష్ (552)

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పలు మండలాలకు చెందిన విద్యార్థులు ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. మంగళవారం ఏపీ ఈఏపీ సెట్ ఫలితాలను అధికారులు విడుదల చేశారు. పెనుమూరు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన బద్రి (454వ ర్యాంక్), పాలసముద్రం ఎస్ఎన్ కండ్రిగ కు చెందిన కామేష్ (552వ ర్యాంక్), తవణంపల్లె మండలం పైమాగం గ్రామానికి చెందిన తేజస్వి (688వ ర్యాంక్), నగరి మండలం మహాత్మానగర్‌కు చెందిన ఆదిత్య నివాస్ (900వ ర్యాంక్), నింద్ర మండలానికి చెందిన భరత్ (1,050 వ ర్యాంక్), కుప్పం మండలం చిత్తరంజన్ వీధికి చెందిన శ్రీయాన్స్ (1,402వ ర్యాంక్), కుప్పం మండలం అడవిబుదుగూరుకు చెందిన వెంకటేష్ (1,434వ ర్యాంక్), చిత్తూరు నగరంలోని సంతపేటకు చెందిన వర్షిత (1,465వ ర్యాంక్) సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.